లలో ఉండి బయటకు రాలేకపోతున్నారు. దీనికి ముఖ్యకారణం వారికి ప్రోత్సాహం లేకపోవటమే. కనుక వారికి ప్రోత్సాహమివ్వటం అత్యావశ్యకం. అప్పుడుకాని యువక హృదయాలలో ఉండే భావాలు వెలికిరావు. ఈ సభ అందుకోసమే స్థాపించబడింది. కనుక మాజడ్జస్ తీర్పు ప్రకారం ఈయేడు బంగారు పతకాన్ని శ్రీమతి శారద గారికి బహూకరిస్తున్నాం" అని ప్రకటించాడు. శ్రోతలు చెవులు తూట్లుపడేటట్టు చప్పట్లు కొట్టారు. రంగదాసు ఒకవైపు ఆశ్చర్యంతోనూ మరొకవైపు సంతోషంలోనూ ఉక్కిరి బిక్కిరయ్యాడు.

శారద ముందుకువచ్చి బహుమతి నందుకుంది. సభికులకు నమస్కరించి "ఇందులో నా ప్రజ్ఞ ఏమీలేదు. ఇదంతా నాగురువు-మహా విద్వాంసులు అయిన శ్రీరంగదాసుగారి దయ" అంది. ఇది విన్న రంగదాసుకు గుండె ఆగినంతపనయింది. తప్పట్లు మిన్నుముట్టాయి.

సుమతి అక్కడ నిలువలేకపోయింది. తన ఆశాసౌధం కూలిపోయింది. కారులో వెళ్లిపోయింది.

రంగదాసు వెళ్లి శారద నభినందిద్దామనుకున్నాడు. కాని కాళ్లు ముందుకు సాగలేదు. ఆమెకు తానేదో ద్రోహం చేసినవాడికి మల్లే భయపడ్డాడు. ఆమె శ్రేయస్సుకోసం దైవాన్ని ప్రార్థించి వెనుదిరిగాడు.

తన యింటిదగ్గఱ సుమతి ఉండటం గమనించాడు రంగదాసు.

"మేష్టారూ! నన్ను క్షమించండి. దైవతుల్యులైన మిమ్మల్ని బాధించినందుకు తగిన ప్రాయశ్చిత్తరం జరిగింది. ఈ అవమానాన్ని భరించటం యెలాగ? శారదనుకూడా హింసించాను. నన్ను మన్నించకపోతే గతిలేదు." అని విలపించింది సుమతి.

"ఊరుకోమ్మా! జయాప జయాలు దైవాధీనాలు. ఒక్కసారి శారదతో మాట్లాడితేకాని నా నెత్తిమీది బరువు దిగదు. పోదాం పద" అన్నాడు రంగదాసు—

---

కథానిక

# చెడిపోయిన జగ్గయ్య

ముద్దంశెట్టి హనుమంతరావు

మానవుల మనస్తత్వాలు కాలం మార్పుతో మారుతూనే వుంటాయి. పెద్దలకున్న అభిప్రాయాలూ, ఆశయాలూ పిన్నలకుండవు. పిన్నలకుండే ఆశయాలు అంతకంటె చిన్నవారికుండకపోవచ్చు. ఒక్కొక్కరి కొక్కదానిపై అభిమతముంటుంది. నాగరికు లవుతున్నకొద్దీ సభ్యతలూ, వేషభాషలూ మారుతూవుండటం సహజం.

జగ్గయ్య మిలిటరీలో, యెవ్వరికీ తెలియకండా చేరాడనీ, తల్లి మరణానికతడే కారకుడనీ, కనీ, పెంచి పెద్దవానిగా చేసినందుకు ఇదే వాడు కావించిన మహోపకారమనీ ఆగ్రామంలో పెద్దతలకాయలన్నీ అనుకున్నాయ్. ఆగ్రామం చెప్పుకోవాలంటే అట్టే పల్లెటూరు కాదు - పట్టణమూ కాదు. మధ్యవర్గానికి చెందుతుంది. రమారమి పది పన్నెండు బట్టలకొట్లు కూడా వున్నయ్. అయినా అక్కడి ప్రజల్లో చాలమందికి వ్యవసాయం కలకాలంగా వస్తూన్న వృత్తి. జగ్గయ్య తండ్రి, వెంకయ్యక్కూడా లేదనకండా ఓ పదెకరాల మాగాణీ మూడెకరాల మెట్టభూమి వుంది. దాన్ని స్వంతంగా సేద్యంచేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్నాడు.

వెంకయ్య భార్య సీతమ్మ. వారికి జగ్గయ్య ఒక్కడే కొడుకు. అతనికంటె చిన్నది చెల్లెలు కూడా ఒక్కతే. సీతమ్మకు, కొడుకంటే పంచప్రాణాలు. జగ్గయ్య చిన్నతనంనుండి చదువుయందు అభిలాష చూపుతుండేవాడు. గ్రామంలో ఎలిమెంటరీస్కూలుకి ప్రతిదినం తప్పకండాపోయిన వాళ్ళల్లో జగ్గయ్య ఒకడు. వెంకయ్యకు చదువుపై అంత వున్నతఅభిప్రాయాలు లేకపోయినా, "వాడికేది యిష్టమయితే అదే చెయ్యనీండి" అం

టున్న భార్య మాటలను కాదనలేక అవూరిలో వున్నంత చదువూ చదివేందుకు ఒప్పుకున్నాడు. తక్కిన పిల్లల్లా కాకుండా జగ్గయ్య యెప్పుడూ నీటుగా వుండేందుకు ప్రయత్నించేవాడు. కొడుకుని చూచి సీతమ్మ అప్పుడప్పుడు మురిసిపోతూ మంచి బట్టలుకూడా కుట్టించడంకద్దు.

అవూరి స్కూల్లో అయిదవ తరగతివరకే వుంది. జగ్గయ్యకు పన్నెండోయేడు వచ్చేసరికే అయిదోక్లాసు పాసయ్యాడు. వూరి మాస్టారు కూడా జగ్గయ్య తెలివితేటలకు అతని ఉత్సాహానికి అచ్చెరువంది పైచదువు చదివిస్తే బావుంటుందని సలహాయిచ్చాడు వెంకయ్యకు. ఆ సలహాలోవున్న మంచిని గ్రహించలేక, పట్టణంలో చదువుకుంటే పిల్లలు పాడవుతారనే మూఢనమ్మకం విడువక సలహాని ఖండించాడు. జగ్గయ్య చదువుకుంటానని ఒకే కాలుమీద కూర్చున్నా ఫలితం లేకపోయింది. కొడుకుమీద యెంత గాఢమయిన ప్రేమ వున్నప్పటికీ సీతమ్మ యీ విషయంలో భర్తను యెదురుతిరుగలేకపోయింది.

జగ్గయ్య నిరాశతో క్రుంగిపోయాడు. ఆ పన్నెండేళ్ల వయస్సులోనే అతనికి జీవితంమీద విరక్తి పుట్టింది. అవూరి నాయుడికొడుకు పట్టణంలో చదువుతూవుండటం, సెలవల్లో అతనీవూరికి వచ్చినప్పుడంతా. జగ్గయ్యకు తనూ అలా యెందుకుండకూడ దనిపిస్తుంది. తనకా అదృష్టం పట్టలేదని నిస్పృహం జెందుతాడు. నాయుడు కొడుకు ఊళ్లోకి వచ్చినప్పుడంతా అతడితోనే తిరుగుతూ కాలం గడుపుతూండేవాడు. నాయుడుకొడుకు పట్టణంపోయి యేదో తనకులేని గొప్ప నాగరికతా, ప్రపంచ జ్ఞానం సంపాదించినట్లూహించుకుంటాడు.

కొడుకు విషయంలో వెంకయ్య చాలా నిరసన చూపుతున్నాడు. వ్యవసాయం అలవర్చుకోమంటాడు జగ్గయ్యను. కాని జగ్గయ్య అసలు ఆ జోలికే పోవటానికి సమ్మతించడు. వారిరువురి మనస్తత్వాలూ వేర్వేరుగా వున్నయ్. ఆ తండ్రికొడుకేలఅయినా, ఒకే రక్తం యిరువురి రక్తనాళాల్లో ప్రవహిస్తున్నా, వారి అభిరుచులు వేరయ్యాయి. తల్లి ధర్మమా అంటూ, యింటిబజారు యింకేవో చిల్లరపనులు చెయ్యటంతప్పితే మరో పనంటూలేదు జగ్గయ్యకు. కొడుకు కాలం వృథాపుచ్చటం వెంకయ్యకు మరీ భరించరాని విషయమవుతూ వచ్చింది. అప్పుడప్పుడు చీవాట్లు వేస్తూండేవాడు. కాని సీతమ్మ అడ్డుపడి అతన్నే వారిస్తూండేది. తల్లులే పిల్లల్ని పాడుచేస్తారని రెండుమూడు సార్లన్నాడుకూడా వెంకయ్య. ఎంతయినా మాతృ హృదయంకదూ! కొడుకు యీ చీవాట్లు పడలేక ఎక్కడికైనా పరారవుతాడేమోనని ఆమె భయం. తన కళ్లముందు మెలిగితే చాలునుకుంది సీతమ్మ.

“నువ్వే వాణ్ణి పాడుచేస్తున్నావ్! నీ ఆసరా చూసుకొనే వాడల్లా నిర్లక్ష్యంగా తిరుగుతున్నాడు, మూడు పూటలూ బాగా మెక్కి. ఇలా యెంతకాలం? నాలో జబ్బపుష్టి వున్నంతవరకేగా? తరువాత జీవనాధారం యేమైనా వుందా వాడికి? నువ్వూ నాలుగుచీవాట్లు పెడితే వ్యవసాయం చేయటానికి వూనుకోడూ?” అన్నాడోరోజు వెంకయ్య భార్యతో.

“మరేం చేయను చెప్పండి? వాడికి వ్యవసాయం విషయంలో పూర్తిగా విరక్తి భావం వుంది. చదువుకుందామన్న ఆసక్తి నాటుకుంది వాడిలో. మీరు దాన్ని పూర్తిగా ఖండించారు. వాడు వ్యవసాయం చేయనంటాడు. నేను మధ్యన నలిగిపోతున్నాను” అంది కంట తడిపెట్టుకుంటూ.

“నువ్వర్థం చేసుకోలేకండా వున్నావ్ సీతా! నాకుమాత్రం వాడంటే యిష్టంలేదూ! పట్టణంలో చదువుతున్న కుర్రాళ్లంతా యెలా తయారవుతున్నారో యింట్లో కూర్చున్న నీకేం తెలుసు? చివరకు చదువూరాక వ్యవసాయమూ చేతకాక రెంటికీ చెడ్డరేవటులవుతున్నారంటేనమ్ము. వీడైనా వ్యవసాయమంటే ఏమిటో యెందుకర్థంచేసుకోలేకపోతున్నాడో నాకు తెలీకండావుంది. మాటకనుకుందాం-అందరూ చదువుకుంటే సేద్యంచేసేవాళ్లెవరైతే? వాడు ఒక్కటే మొండిపట్టు పట్టాడు. దానికి నువ్వు తాళం వేస్తున్నావ్.”

ఆరోజునుండి కొడుకు విషయంలో వెంకయ్య యిసుమంతయినా జోక్యం కలుగజేసుకో లేదు. జగ్గయ్యకూడా తండ్రి యెదుటబడటం కంటకప్రాయంగా భావించేవాడు. తల్లి జగ్గయ్యకు యెన్నోవిధాల నచ్చజెప్పింది. కాని అతడు పట్టు విడువలేదు. వ్యవసాయంవూసే తనయెదుట యెత్తవద్దన్నాడు. సీతమ్మ పాపం యేంచేస్తుంది?

యిటు కొడుకు వ్యవసాయం నిరాకరిస్తున్నాడు. అటు భర్త విద్యను నిరసిస్తున్నాడు. ఆమెకేం పాలుపోక వూరుకుంది.

"ఏరా వెంకయ్యా! కొడుకుని వుద్యోగస్తుని చేస్తావేంటి? చూస్తావేం పట్టణంలో చదివించు" అని యెవరైనా అడిగినా "మరింత చెడిపోవటానికా చదివించటం? వ్యవసాయంలో మరి కొద్దిదినాలుపోయాక దిగుతాడు" అని జవాబిచ్చేవాడు వెంకయ్య. వాళ్లు నవ్వుకుంటూ పోయేవారు.

ఆరు సంవత్సరాలకాలం ఆగకుండా నడిచింది. జగ్గయ్యకు 18 వ యేడు. అప్పటివరకూ జగ్గయ్య తన మొండిపట్టు విడువక అలానే జీవితం గడిపాడు. వీలున్నంతమట్టుకు పిల్లలకు ప్రయివేటు చెప్పడం, అవల్లన నాలుగు పైసాలతో సాదరు ఖర్చు గడుపుకుంటుండటం సాగించేవాడు. జగ్గయ్యచెల్లెలు చిట్టమ్మ ఇప్పుడు యుక్తవయస్కురాలు. వెంకయ్య ఆమెకు వివాహం చేయాలన్న నిశ్చయంతో సంబంధాలకై చిందులు తొక్కి చివరకు కొద్దిపాటి దూరంలోనున్న మరో పల్లె గ్రామంలో ఓ సంబంధం యేర్పరచి పెళ్లి నిశ్చయంచేశాడు. జగ్గయ్యనుకూడా ఓ యింటివాణ్ణి చేసి, తన బాధ్యత తీర్చుకోవాలనుకున్నాడు వెంకయ్య. కాని జగ్గయ్య తనకప్పుడే వివాహం వద్దన్నాడు.

కూతురి వివాహం జరిగిపోయిన తరువాత తనపైవున్న యేదో భారాన్ని, విధిని తీర్చుకున్నట్టుగా భావించుకున్నాడు వెంకయ్య. ఇంక అతనికి మిగిలినదంతా కొడుకు భావి జీవితం గూర్చిన చింతే. తనుమాత్రం యేంచేస్తాడు? నోరునొప్పెట్టేలా బోధపర్చాడు. వినకుంటేగా చెల్లెలి వెంట అత్తవారింటికి పోయేందుకు జగ్గయ్య నియమింపబడ్డాడు ఏదో యీసాకుతోనైనా కొన్ని దినాలు హాయిగా కాలం అక్కడ గడుపవచ్చని సంబరపడ్డాడు జగ్గయ్య.

చెల్లెలి అత్తవారి వూరుకూడా జగ్గయ్యకు అంతగా ఆనందాన్ని కలుగజేయలేకపోయింది. ఆమాటకు వస్తే తను వూరుకంటే అది చిన్న దే- అనుకున్నాడు తనలో. వుబుసుపోకకు స్కూలు మాత్రం వుంది. ఎక్కడచూచినా వ్యవసాయదారులే. ప్రతివాడూ వ్యవసాయానికి సంబంధించిన మాటల్లో తేలిపోతున్నారు. అంతకు మించిన విషయాలు లేవు. కొందరు ముసలివాళ్లు మాత్రం రాజకీయాల్లో కొంత శ్రద్ధ కనపర్చటం గమనించాడు. వచ్చిన రెండోరోజున ఆవూర్లో మిలిటరీ వ్యక్తిని ఖాకీ దుస్తుల్లోనూ, నెత్తిన టోపీతో చూచి చంకలు గుద్దాడు. ఎందుకో ఆ వుత్సాహం! ఆనూతన వ్యక్తిని చూచిన తరువాత వెంటనే అతనితో స్నేహం చేయాలనుకున్నాడు. అనుకున్నంతపనీ ఆ సాయంకాలమే నెరవేర్చుకున్నాడు. ఎప్పుడూ అతనిదగ్గరే కాలం గడుపుతుండేవాడు. ఆ మిలిటరీ మనిషి యేవో టప్పండాలు కొడుతూవుంటే అమాయకులైన ఆ పల్లె ప్రజలు కొందరు నిశ్శబ్దంగా వింటుండేవారు. అతడు చెప్తున్నవన్నీ పదహారణాల పచ్చి అబద్ధాలయినా, ఆ వుద్యోగంలో యేదో ఆకర్షణ వున్నట్టు భావించాడు జగ్గయ్య. అప్పటికతని మనసులో మిణుకుమిణుకుమంటున్న ఆశయాలు మళ్లీ ప్రకాశించాయి. తనిప్పుడేం చేయగలడు? వుద్యోగం చెయ్యాలంటే చదువు సున్నా. వ్యవసాయం తనకు పరమ అసహ్యం. అనుకున్న జగ్గయ్య కళ్లముందు మిలిటరీ వుద్యోగం మెరుపులా మెరిసింది.

క్రమంగా ఆ మిలిటరీవ్యక్తినుండి అన్నిసంగతులూ తెలుసుకున్నాడు. ఈలోగా వెంకయ్య వుత్తరంపై అతడు స్వగ్రామం పోవలసివచ్చింది. తనకు ముఖ్యస్నేహితుడైన ఆవూరి స్కూలు మాస్టరుతోమాత్రం తన అభిప్రాయాన్ని, అభిరులని చెప్పాడు. స్కూలు మాస్టరుకూడా అతని అభిరుచులని ప్రోత్సహించాడు. తలిదండ్రులకు, తదితరులకు తనఅభిప్రాయమే తెలియనివ్వకుండా, సినిమాకు పోతున్నట్టుచెప్పి పట్టణం బయలుదేరాడు. సంగ్రహించిన కొద్దిపాటిడబ్బు పట్టుకున్నాడు. పట్టణం అతడుపోవటం అదే మొదటిసారి. పట్టణంలోని భవనాలు,రోడ్లు,చూస్తూంటే, అపరయింద్ర లోకంలా కనిపించింది అమాయకునికి. త్రోవపోయేవార్నడిగి తెలుసుకున్నాడు రిక్రూట్‌మెంటు ఆఫీసు జాడ. తనలాంటి యువకులెంతోమంది వచ్చిపోతుండటం చూశాడు. అతనిలో వుత్సాహం అధికమయింది. తనూ పోయాడు. ఆఫీసరుతో మాట్లాడుతూ

ఉంటే కాళ్ళు గజగజ వణికిపోయాయ్. కాని ధైర్యం తెచ్చుకుని అడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పాడు. వాళ్లేదో కాగితంవ్రాసి జగ్గయ్య సంతకం తీసుకున్నారు. వేలి ముద్ర పెట్టకుండా తెలుగులో సంతకంచేయటం అతనికో గర్వించగల విషయం. తరువాత తెలియపరుస్తామన్నారు. జగ్గయ్యమాత్రం తెలివితక్కువవాడా? స్కూలుమాస్టరు చిరునామా యిచ్చాడు.

రెండో ప్రపంచయుద్ధం జరుగుతున్న రోజులవి. ఎక్కడవిన్నా అద్భుతవిషయాలే-యెన్నో జీవుల అకాలపు మరణాలు. ఇంట్లో జగ్గయ్య మిలిటరీ వుద్యోగాన్ని మహాగొప్పగా వర్ణించి మెచ్చుకుంటుండేవాడు. అప్పుడప్పుడు సీతమ్మకు ఓపక్క ఆధైర్యం పీక్కుతింటూ ఉండేది. కొంప దీసి వీడు అందులో చేరిపోడుకదా అని ఆమె అతనికి వ్యతిరేకంగా మిలిటరీ గురించి నిరసనగా చెప్పుతూండేది. ఏంలాభం? వాడికివన్నీ రుచిస్తాయా?

జగ్గయ్య పట్నంవెళ్లి తిరిగివచ్చిన పదిరోజులకు స్కూలుమాస్టరుపేర ఓ వుత్తరం వచ్చింది. వెంటనే ప్రయాణ సన్నాహంతో పట్టణం వచ్చేయమని. ప్రతిదినం జగ్గయ్య స్కూలుకిపోతుండటంవల్ల, ఆ వుత్తరం సరిగ్గా టైముకే అందింది. అతని సంతోషానికి మేరలేకపోయింది. తను బయటపడేవరకూ ఎవ్వరితో చెప్పనని మాస్టరువద్ద వాగ్దానం తీసుకున్నాడు. రాత్రి నిశ్చింతంగా పరున్నట్టు అభినయించాడు. అంతకుముందే సంచితో బట్టలు, ఓ దుప్పటి మాత్రం తయారు చేసి వుంచాడు. కన్ను పొడుచుకున్నా నిద్రన్నది పట్టలేదు. ఏవో అంతులేని ఆలోచనలు అల్లుకుపోతున్నయ్ మెదడులో. రెండుగంటలుకొట్టింది ప్రక్కింటివారి గోడగడియారం. అంతా నిశ్శబ్దం. తండ్రీ తల్లీ తక్కిన నౌకర్లు ప్రపంచంతో సంబంధంలేనట్టు పరున్నారు. చప్పుడుకాకుండా మెత్తి అడుగులువేసుకుంటూ సంచీ చేతపుచ్చుకుని ఇంటి బయటకువచ్చాడు. ఆ రాత్రిసమయంలోకూడా నాటుబళ్లు, మనుషులు నడుస్తూనేవున్నారు. అతనికి మనోవీధిలో మెలుగుతున్నదంతా మిలిటరీ వుద్యోగం, ఆ దుస్తులు, ఆ టోపీన్నూ—అంతే! జగ్గయ్య పట్నంలోని రిక్రూట్‌మెంటు ఆఫీసు చేరుకుండేసరికి తెల్లవారింది. అక్కడనుండి అందరితోపాటు జగ్గయ్యకూడా తర్ఫీదుయిచ్చేందుకు మరో దూరస్థలం పంపబడ్డాడు.

తెల్లవారింది పల్లెటూరిలో. జగ్గయ్య జాడ కనుపించలేదు. బయటకుపోయివుంటాడనుకున్నారు. కాని యెంతకీ రాకపోవటం భయంకలిగింది వెంకయ్యకు. తల్లి సీతమ్మగుండె బాదుకుంది. వెంకయ్య నలుమూలలా వెదికించాడు. మనమాటలు పడలేక యే దుర్మరణానికి పూనుకున్నాడోనన్న భయం అతన్ని ఆవరించింది వెంకయ్యకు. చెరువులు, నూతులు అన్నీ చూడమన్నాడు. కాని లాభం లేకపోయింది. సీతమ్మ కొడుకు పడుకుండేమంచం దగ్గరే కూలబడి యేడుస్తూంటే తలక్రింద ఓ చిన్న చీటీదొరికింది. వెంకయ్య దాన్ని పట్టుకుని స్కూలు మాస్టరుకోసం కబురంపాడు. స్కూలుమాస్టరు అందరూ వింటూండగా చదివాడావుత్తరాన్ని.

"అమ్మా! మీరనుకున్నట్టు నేను వ్యవసాయం చేయలేను. వుద్యోగంచేద్దామంటే యెక్కువ చదువులేదాయె. అందుకే నేను నా భావిజీవితం కోసం మిలిటరీలో చేరిపోయాను. వుత్తరాలు వ్రాస్తుంటా. జవాబిస్తుండండి. నాన్నగార్కి నమస్కారములు, చెల్లెలి క్షేమసమాచారాలు తెలుపుతూవుండు. మళ్ళీ యెప్పుడో కలుసుకోవటం!—జగ్గయ్య"

ఆ వుత్తరం వింటూనే తెలివితప్పింది సీతమ్మ. అది మొదలు మంచంపట్టింది. ఎప్పుడూ కొడుకునితలుస్తూనేవుంటుంది. పదిహేనురోజులు జగ్గయ్యనే పలవరించుకుంటూగడిపి చివరకు నిరాశతో కళ్లుమూసింది. ఊళ్ళోవాళ్ళందరూ జగ్గయ్యదే నేరమనిమాటలన్నారుకాని జగ్గయ్య దీనికెప్పుడూ బాధ్యుడు కాడని తెలుసుకున్నవాడొక్క మాష్టరే. భార్యకు దహనక్రియలుచేసి ఇల్లు చేరుకుని ఒంటరిగా విచారించాడు వెంకయ్య. తన బుద్ధి తక్కువకు తనే నిందించుకున్నాడు. జగ్గయ్య పోయి ఇప్పటివరకు వుత్తరంలేదు. అతనికి పాపం తల్లి మరణించిందన్న విషయమే తెలియదు.

నెలదినాల తరువాత జగ్గయ్యదగ్గరినుండి ఓ వుత్తరం, 20 రూ. మణియార్డరు వచ్చాయి. వెంకయ్య వుత్తరాన్ని మొదట చదివించాడు. జగ్గయ్య బెంగుళూరులో వుంటున్నట్టు, మరి అయిదుమాసాలవరకూ అక్కడే వుంటానన్నట్టు అందులో వ్రాశాడు. కొడుకు ప్రత్యక్షంగా కను

షించకపోయినా, పరోక్షంగా వాడి క్షేమసమాచారాలు తెలియపర్చినందుకు దుఃఖంలో సంతోషాన్ని కనపర్చాడు వెంకయ్య. అంతే కాని రూపాయలు అతన్ని సంతోషపెట్ట లేకపోయినయ్. కొడుకు పంపిన రూపాయలు వేరేగా ఓ దగ్గర దాచిపెట్టాడు. అందులోది ఓ దమ్మిడి అయినా వాడకూడదని నిశ్చయించుకున్నాడు. కొడుకు పంపిన చిరునామా ప్రకారం వెంకయ్య ఓ వుత్తరం అతనికి వ్రాయించాడు. అన్ని విషయాలతో తల్లి మరణించినట్టు, ఓసారి రమ్మని ప్రాధేయపడ్డాడు. ఆ వుత్తరం జగ్గయ్య చదువుకొని మొదలు తెగిన వృక్షంలా చతికిలపడ్డాడు. ఉద్యోగం విడిచి పరారయి ఇంటికి పోవాలనుకున్నాడు. కాని తాను బాండులో సంతకం పెట్టినట్టు జ్ఞాపకం వచ్చింది. ఉప్పొంగుతున్న దుఃఖాన్ని ఒక్కసారి దిగమ్రింగుకున్నాడు.

రెండేండ్లు యెన్నో యుగాల్లా గడిచినయ్. జగ్గయ్య అందరితోపాటు యుద్ధరంగానికి పంపబడ్డాడు. అప్పటివరకు తండ్రీ కొడుకులమధ్య వుత్తరప్రత్యుత్తరాలు జరుగుతునేవున్నయ్. కాని అది మొదలు ఆపివేయబడ్డయ్ దురదృష్ట దేవత జగ్గయ్యను వరించింది. అకస్మాత్తుగా యుద్ధరంగంలో అతని చేతికి బలమైన గాయం తగిలింది. స్పృహతప్పి పడిపోయాడు. కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రిలో వున్నాడు. అదంతా ఓకలలా కనుపించిం దతనికి. ఇప్పుడు విచారించాడు యీ నరకంలో కెందుకొచ్చానా? అని. హాస్పిటలంతా దుర్వాసనతో నిండివుంది. డాక్టరు వచ్చి పరీక్ష చేశాడు. చేయి ముడుకువరకు పూర్తిగా తీసేయాలన్నాడు. లేకపోతే ప్రాణాపాయం కూడా కలుగవచ్చునని చెప్పాడు. జగ్గయ్య "సరే" నన్నాడు. ఆ రోజే ఆపరేషన్ అయింది. మరో నెలదినాలవరకూ అక్కడే వుండాలన్నారు. సమ్మతించాడు జగ్గయ్య. సమ్మతించక యేం చేస్తాడు? అనుభవించాల్సిందే!

అక్కడ వెంకయ్యకు కొడుకుదగ్గరినుండి వుత్తరాలు లేకపోవటంవల్ల మనోవ్యధపట్టుకుంది. ప్రతీ రోజూ వింటూనేవున్నాడు, యుద్ధంలో అసంఖ్యాకులైన యువకులు మరణిస్తున్నారని. ఏతండ్రి హృదయం తల్లడిల్లదు? ఇదంతా తనవల్లే ఐందని మరోసారి నిందించుకున్నాడు. ఊరిలో స్నేహితులు కొందరు ధైర్యంచెప్పారు. కాని లాభం లేకపోయింది. రోజుకిరోజు అతని ఆరోగ్యం క్షీణించింది. ఈ విషమ సమయంలో ఓ వుత్తరం వచ్చింది. అది జగ్గయ్య నుండే అని అందరూ అనుకొన్నారు. స్కూలు మాస్టరు దాన్ని విప్పి చదివాడు. జగ్గయ్య దగ్గరినుండే వచ్చింది. అందులో యేమంత యెక్కువ విశేషాలులేవు.

"నాన్నగారూ!

క్షేమంగా వున్నా. యీ మధ్యనే ఓసారి రావటానికి ప్రయత్నిస్తా.

జగ్గయ్య."

ఆ వుత్తరం అందరి హృదయాల్ని రంజింపజేసింది. ముఖ్యంగా మనోవ్యధతో అణిగిపోయిన వెంకయ్య ఆనందంతో నవ్వుకున్నాడు. స్కూలు మాస్టరు ముఖం వికసించింది.

జగ్గయ్య ఆసుపత్రిలో 25 రోజులు వుండగానే యిక చాలునన్నారు డాక్టర్లు. అతని ఎడమచేయి ముడుకువరకు తీసివేయబడింది. ఇంకే ఉద్యోగానికీ ప్రస్తుతం పనికిరాడనీ, యుద్ధరంగములో యీ అపాయం జరగటంవల్ల . పెన్షను యేర్పాటుచేసి యింటికి పంపించాలని తీర్మానించారు అధికార్లు. నెలకు 30 రూపాయిలు పెన్షనుపై జగ్గయ్య యింటికి పంపివేయబడ్డాడు.

స్వగ్రామం చేరుకున్నాడు. ఊరిలో అందరూ సంతోషించారు తండ్రియెదురుగా వచ్చి కౌగలించుకొన్నాడు. ఆ సంతోషంలోనే దుఃఖం ఆవరించింది. మొండిచెయ్యి చూపి కంట తడిపెట్టుకున్నాడు. ప్రాణాన్ని నిలబెట్టుకొని తిరిగి వచ్చినందుకు సంతోషించమని మరి కొందరూరడించటంతో దుఃఖాన్ని నిలుపుకున్నాడు వెంకయ్య. చిట్టెమ్మ దుఃఖానికంతే లేకపోయింది. ఎంతయినా తోబుట్టువుకదూ మరి అన్నయ్య యింత భల్లూకపుపట్టుతో మిలిటరీకి పోతాడని ఆమె యెప్పుడూ అనుకోలేదు.

ఇప్పుడు జగ్గయ్య యింటి వ్యవహారాల్లో పెత్తనము వహించాడు. వ్యవసాయమందు విముఖత జూపినా వ్యాపారంలో మాత్రం చెయ్యి చేసుకొంటున్నాడు. కావలసినంత లోకజ్ఞానం కలిగింది. ఇంగ్లీషు వ్రాయనూ, చదువనూ, నేర్చుకున్నాడు. ఆ వూరిలో యిప్పు డతనో గొప్ప అనుభవంగల వ్యక్తి.